# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలో బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక సంస్కరణలను చేపట్టిందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- ❖ త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు 2025కు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది.
- ❖ భారత ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పురోగతిని సాధిస్తుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు.
- ❖ బెట్టింగ్, జూదం అనేవి రాష్ట్ర పరిధిలోని అంశాలేనని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

=========================

బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు 2024ను రాజ్యసభ ఈరోజు ఆమోదించింది. లోక్‌సభ ఆమోదం తెలిపింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ చట్టం 1934, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1955, మొదలగు చట్టాలను సవరించడానికి ఈ బిల్లు ప్రవేశపెట్టబడింది. బ్యాంకు ఖాతాకు నామినీల ఎంపికను నాలుగుకు పెంచడాన్ని ఈ బిల్లు ప్రతిపాధించింది. బ్యాంకులు తమ ఆడిటర్ల వేతనాన్ని నిర్ణయించుకునేందుక ఈ బిల్లు అధికారం కల్పిస్తుంది. ఈబిల్లు పై చర్చకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిస్తూ... దేశంలో బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక సంస్కరణలను చేపట్టిందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం బలమైన బ్యాంకింగ్ పాలనా చట్టాన్ని అమలులోకి తెచ్చిందని పేర్కొన్నారు.

=========================

త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు 2025ను లోక్‌సభ ఈరోజు ఆమోదించింది. సభలో బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు 2025 గ్రామీణ ఆర్థిక వ్యవస్థను శక్తివంతం చేస్తుందని, స్వయం ఉపాధి కల్పించడంలో చిన్న తరహా వ్యాపారస్తులకు సహాయపడుతుందని అమిత్ షా అన్నారు. ఈ బిల్లు దేశంలో సహకార రంగాన్ని బలోపేతం చేస్తుందన్నారు.

గుజరాత్‌లో అమూల్ కంపెనీకి పునాది వేసిన త్రిభువన్ భాయ్ పటేల్ పేరు మీద త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయానికి నామకరణం చేశామని అమిత్ షా వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=========================

భారత ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పురోగతిని సాధిస్తుందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ముంబైలో జరిగిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (FATF) ప్రైవేట్ సెక్టార్ సహకార ఫోరం (PSCF) కర్టెన్-రైజర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ మాట్లాడుతూ... ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చట్టబద్ధమైన కార్యకలాపాలను అణచివేయకూడదని హెచ్చరించారు. "సమతుల్య నిబంధనల"ను పాటిస్తూ.. వినియోగదారుల హక్కులు, సౌలభ్యాన్ని కాపాడాలని సంజయ్ మల్హోత్రా పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

=========================

భారతదేశానికి చైనా నుంచి నేరుగా విమాన సర్వీసులు తిరిగి ప్రారంభించాలని యోచిస్తున్నామని చైనా కాన్సులేట్ జనరల్ జు వీ పేర్కొన్నారు. ఈ మేరకు భారత అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు. కోల్‌కతాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "కరోనాకు ముందు బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ, కున్మింగ్ నుంచి భారత్‌లోని ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, ఇతర నగరాలకు వారానికి 50 విమాన సర్వీసులుండేవని తెలిపారు. ఆ సేవలను తిరిగి పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. విమానాల పునరుద్ధరణ తర్వాత వీసా నిబంధనల్లో కూడా సడలింపులు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలకు మరో వారంలో 75 సంవత్సరాలు పూర్తి కానుండడంతో ఏప్రిల్ 1న ఇరుదేశాలు సంయుక్తంగా కొన్ని వేడుకలను జరుపుకోనున్నాయని జు వీ వెల్లడించారు.

=========================

దక్షిణ కొరియా ఆగ్నేయ ప్రాంతంలో చెలరేగిన మంటలలో ఇప్పటివరకు 24 మంది మరణించారని, మరో 12 మంది పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. ఈ మంటల కారణంగా 23 వేల మందికి పైగా ప్రజలు తమ ఇళ్లను వదిలి వెళ్లారని తెలిపారు. ఉయిసియాంగ్ నగరంలోని 1,300 సంవత్సరాల పురాతన గౌన్సా ఆలయం, 17 వేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో ఈ మంటలలో దగ్ధమయినట్లు వెల్లడించారు. అమెరికా సైన్యం, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు కృషి చేస్తున్నాయని అధికారులు వెల్లడించారు.

విరామం

=========================

ఐటీ మధ్యవర్తిత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం 1,410 ఆన్ లైన్ గేమింగ్ బెట్టింగ్ వెబ్‌సైట్‌లను నిలిపివేసిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈరోజు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ... ఆన్‌లైన్ గేమింగ్ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. బెట్టింగ్, జూదం అనేవి రాష్ట్ర పరిధిలోని అంశాలేనని, దాని కోసం శాసన చట్టాన్ని రూపొందించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఆన్‌లైన్ గేమింగ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి రాష్ట్రాలకు రాజ్యాంగం నైతిక, చట్టబద్ధ అధికారాన్ని ఇచ్చిందని కేంద్రమంత్రి తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 112 కింద కూడా చర్యలు తీసుకుంటామని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

=========================

కలుషిత ఆహారంపై  ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఆహార ప్రజా పంపిణీ, వినియోగదారుల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఈరోజు లోక్‌సభలో అనుబంధ ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానమిస్తూ... ఆహార కల్తీపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే ప్రభుత్వం విచారణ చేపట్టి,  తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. వివిధ ఆహార వస్తువుల పరీక్ష కోసం, FSSAI దేశ వ్యాప్తంగా 242 ప్రయోగశాలలు, 4 రిఫెరల్ ప్రయోగశాలలు, మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ప్రయోగశాలలను ఏర్పాటు చేసిందన్నారు. కలుషిత ఆహారంపై  ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం సామాజిక మధ్యమలను విస్తృతంగా వినియోగిస్తుందని తెలిపారు. మరొక ప్రశ్నకు సమాధానమిస్తూ... జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ నెంబర్ వినియోగదారుల రక్షణకు ఒక పెద్ద సాధనంగా మారిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

=========================

భారతదేశంలో జరిగే ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్దవని, ఈ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం సుమారు 10 లక్షలకు పైగా ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు.  బూత్ లెవల్ ఆఫీసర్లకు (BLO) శిక్షణా కార్యక్రమాన్ని ఈరోజు న్యూఢిల్లీలో ఎన్నికల కమిషనర్ డాక్టర్ వివేక్ జోషితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ పాత్రికేయులతో  మాట్లాడుతూ...  శిక్షణా కార్యక్రమాలలో లక్ష మందికి పైగా బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా బూత్ లెవల్ ఆఫీసర్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమం దశలవారీగా కొనసాగుతుందని, త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలపై ఇది దృష్టి సారిస్తుందని జ్ఞానేష్ కుమార్ పేర్కొంటూ....

(వాయిస్ 29 సెకన్లు)

=========================

ఆర్థిక సంవత్సరం 2023-24లో దేశంలో నిరాదరణకు గురైన 4 వేలకు పైగా పిల్లలను ప్రభుత్వం దత్తత తీసుకుందని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపారు.  ఈరోజు రాజ్యసభలో ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ... దేశవ్యాప్తంగా ఉన్న బాలల సంరక్షణ సంస్థలలో 62 వేల 500 మందికి పైగా పిల్లలకు  మిషన్ వాత్సల్య పథకం కింద ఆదరణ లభిస్తుందని సావిత్రి ఠాకూర్ వెల్లడించారు.

=========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 78,017 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరికి 728 పాయింట్ల నష్టంతో 77,288 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 181 పాయింట్లతో 23,486 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.69గా ఉంది.

=========================
=========================